AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
23-3-2026 (Monday)
MAIN EDITION

## ఎంఎల్ఎం సంస్థ క్యూనెట్‌పై సీసీఎస్ దాడులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మల్టీ లెవెల్ మార్కెటింగ్ సంస్థ క్యూనెట్‌పై సీసీఎస్ పోలీసులు దాడులు చేశారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో సోదాలు చేపట్టారు. క్యూనెట్ మోసాలపై ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం ఉదయం 6 గంటలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలోని ఆ సంస్థ ఆఫీసుల్లో సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లో ఆరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 25 బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. 20 మంది నిందితులను పోలీసులు గుర్తించారు.

## భారీగా తగ్గిన బంగారం ధర..



**అక్షరటుడే, హైదరాబాద్:** కొన్నాళ్ల క్రితం వరకు రోజుకో రికార్డు స్థాయి గరిష్టాన్ని నమోదు చేస్తూ దూసుకువెళ్లిన బంగారం, వెండి ధరలు దిగివస్తున్నాయి. అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ధర పతనం అవుతూనే ఉంది. ఆల్ టైం హై నుంచి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ. 38 వేలపైన తగ్గింది. నేడు సోమవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ. 1.40 లక్షలు పలికింది. అలాగే కిలో స్వచ్ఛమైన వెండి ధర రూ. 2.30 లక్షలుగా ఉంది.

## హర్మూజ్‌కు అమెరికా బలగాలు..



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసి వేయడంతో చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడింది. ఈ క్రమంలో అమెరికా భారీగా బలగాలను జలసంధి సమీపంలోకి పంపడం గమనార్హం. 5 వేల మంది బలగాలను పంపించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై ఇరాన్ సైతం స్పందించింది.

## ప్రైవేటు బిల్లును ప్రతిపాదించిన బీఆర్‌ఎస్



అక్షరటుడే, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్‌ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు.

## పాక్‌లో పెరిగిన ధరలు




అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో పాకిస్థాన్‌లో ఇంధన సంక్షోభం తలెత్తింది. దీంతో ఆ దేశంలో ఇంధన ధరలు భారీగా పెరిగాయి. గతంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన పాక్ ప్రభుత్వం తాజాగా.. హై-ఆక్టేన్ ఇంధనం ధరను 200 శాతం పెంచింది. లీటరు ధరను 200 పాకిస్తానీ రూపాయలు పెంచడంతో 300 పీకేఆర్‌లకు చేర్చినట్లు సమాచారం.



## రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని నిరసన

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఉదయం బీఆర్‌ఎస్ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఆందోళన చేశారు. గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొర్రీలు, పేద విద్యార్థులకు వర్రీలు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే జీతంలో కోత

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రులను పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టనుంది. ఈ మేరకు కొత్త చట్టాన్ని తీసుకురానుంది. 'టీఈఏఎంపీఎస్2026' పేరుతో చట్టం తీసుకురావాలని యోచిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం అవుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచేందుకు చట్టం తీసుకు రానుంది. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం.

## ఆర్థిక శాఖ కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణకు ఆర్థిక శాఖ కార్యదర్శి హాజరుకావాలని గతంలోనే ఆదేశించినా.. ఆయన హాజరుకాలేదు. దీంతో కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ పనుల్లో ఉండడం వల్లే ఫైనాన్స్ సెక్రెటరీ రాలేకపోయారని కోర్టుకు వివరించారు. ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కానీ హైకోర్టు తోసిపుచ్చింది. తాము నేడు అర్ధరాత్రి వరకు కోర్టు హాల్‌లోనే ఉంటామని.. ఫైనాన్స్ సెక్రెటరీ హాజరు కావాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది.

**హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని చెప్పారు. మెట్రో విస్తరణతో పాటు మూసీ సుందరీకరణ చేపడుతామని వెల్లడించారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# కాలుష్య రహితంగా హైదరాబాద్

- **ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు**
- **నగరం నలువైపులా ఎలివేటెడ్ కారిడార్లు**
- **శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పరిశ్రమలను తరలించడం ద్వారా నగరం కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నారు. 20 టీఎంసీ గోదావరి నీటిని తరలించి అందులో 17 టీఎంసీ జంట నగరాల తాగునీటి కోసం, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం నీరు ప్రవహించేలా వినియోగిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీగా మార్చి, ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరం చుట్టూ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని తెలిపారు. మానవ తప్పిదాలతోనే మూసీ నది కలుషితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నది పరీవాహక ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

### ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం

నగరంలో ట్రాఫిక్, పొల్యూషన్ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతామని సీఎం తెలిపారు. పార్కింగ్ సదుపాయాలు లేక వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్రో నగరాల్లో ట్రాఫిక్, వరదలు, కాలుష్యం వేధిస్తున్నాయని పేర్కొన్నారు. వీటి నుంచి హైదరాబాద్‌ను రక్షించడానికి క్యూర్, ప్యూర్, రేర్‌గా సిటీని విభజించామని వెల్లడించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామన్నారు.

### మెట్రోను విస్తరిస్తాం

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మెట్రోను విస్తరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే విస్తరణకు ఎల్‌అండ్‌టీ సంస్థ సహకరించడం లేదని చెప్పారు. దీంతో కేంద్రం సూచన మేరకు మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. నాగోల్, గౌలిగూడ, చాదర్‌ఘట్, అంబర్‌పేటలో ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ కోసం రక్షణ శాఖ భూములపై కేంద్రంతో చర్చించినట్లు సీఎం తెలిపారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు.

### స్మార్ట్ గవర్నెన్స్

స్మార్ట్ గవర్నర్స్ దిశగా తెలంగాణ ఎదగాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు ఇంటికే చేరాలన్నారు. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ ల్యాండ్ తీసుకోకపోయినా గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కి వచ్చే ఇబ్బంది ఏమి లేదన్నారు. మూసీ పక్కన 50 మీటర్ల బఫర్ జోన్‌గా నిర్ణయించింది బీఆర్‌ఎస్ అని చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అవసరమైన భూములు ఉన్నాయని ఆయన తెలిపారు.

## బియ్యం ఎగుమతుల్లో పెద్ద స్కామ్: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల్లో పెద్ద స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. సీబీఐ, ఈడీ కేసుల్లో ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని బియ్యం ఎగుమతులకు అడ్వైజర్‌గా పెట్టుకున్నారన్నారు. ఈ అడ్వైజర్ ఇచ్చిన సలహాతో రాష్ట్రానికి నష్టం జరిగింది నిజం కాదా అని ప్రశ్నించారు. పది లక్షల మెట్రిక్ టన్నులు ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తామని ఎంవోయూ చేసుకున్నామని, ఇదేదో పెద్ద ఇంటర్నేషనల్ అగ్రిమెంట్ అని, మా విజయం అని గొప్పలు చెప్పుకున్నారన్నారు. ఇప్పుడు ఇదే పెద్ద స్కాంగా మారిందని ఆరోపించారు. పది లక్షల టన్నుల ఎగుమతికి ఎంవోయూ చేసుకొని, 22,750 టన్నులు మాత్రమే ఎందుకు ఎగుమతి చేశారన్నారు. మరో 7,500 టన్నులు ఏడాది నుంచి కాకినాడ పోర్టులో పురుగులు పడి ముక్కిపోయాయన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో ఉన్న మీ అడ్వైజర్ ఎక్కడికి పోయాడని ఆయన ప్రశ్నించారు. ఈ సివిల్ సప్లైలో జరిగిన అన్ని కుంభకోణాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేసిన విషయం తెలిసిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సోమవారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దానం పోటీ చేశారని మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో ఇలాంటి పిటిషన్‌లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. కౌంటర్ దాఖలు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి, దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

## ఎన్ని ఎకరాల భూమి ఉన్నా.. ఒక్క ఎకరాకే రైతు భరోసా జమ




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తోంది. రైతు భరోసా పడడంతో హర్షం వ్యక్తం చేయాల్సిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం రైతు భరోసాకు నిధులు విడుదల చేసి విషయం తెలిసిందే. తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేశారు. ఎకరంలోపు ఉన్న రైతులకు మొదట డబ్బులు జమ చేస్తామని చెప్పారు. 20 రోజుల తర్వాత రెండో విడత, ఏప్రిల్ చివరి నాటికి మూడో విడతలో రైతు భరోసా విడుదల చేస్తామని తెలిపారు. మొత్తం రూ.9 వేల కోట్లు అన్నదాతల ఖాతాల్లో వేస్తామన్నారు. సోమవారం ఉదయం నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. అయితే ఎన్ని ఎకరాల భూమి ఉన్నా రూ.6 వేలు మాత్రమే ఖాతాలో జమ అవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## యుద్ధంతో భారత్‌కు సవాళ్లు..: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో యుద్ధం భారత్‌కు సవాళ్లు తీసుకొచ్చిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన లోక్‌సభలో సోమవారం ప్రసంగించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ దిగుమతులపై ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రపంచం మీద యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని చెప్పారు. గల్ఫ్ దేశాల్లో కోటి మంది భారతీయులు ఉన్నారని తెలిపారు. యుద్ధంలో చిక్కుకున్న భారత పౌరులను రక్షించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఇప్పటి వరకు 3.75 లక్షల మందిని సురక్షితంగా భారత్‌కు తరలించామన్నారు. ఇరాన్ నుంచి 1000 మందిని తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలకు పెట్రోల్, గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు ప్రధాని తెలిపారు. 60 శాతం ఎల్‌పీజీని భారత్‌లో ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. హార్మూజ్ జలసంధి నుంచి మన నౌకలు సురక్షితంగా వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

## పరిస్థితులకు తగ్గట్లుగా మారుతున్నా..



**టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల పరిచయం అవసరం లేని పేరు. తెలుగు నటిగా టాలీవుడ్‌లో ఓ వెలుగు వెలుగుతోన్న నటి. తాజాగా ఈ బ్యూటీ కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు తెలిపింది. 'ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొత్తలో సున్నితంగా ప్రతి చిన్న విషయానికి స్పందించే మనస్తత్వంతో ఉండేదాన్ని. కానీ ఇప్పుడు పరిస్థితులకు తగ్గట్టుగా మార్చుకున్నాను. ఇండస్ట్రీలో ఎదురైన కొన్ని చేదు అనుభవాలు, సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి వచ్చే విమర్శలే తనలో ఈ పరిణతికి కారణమని ఈ అమ్మడు పేర్కొంది. ఎవరైనా ఏదైనా చిన్న మాట అన్నా? లేదా సోషల్ మీడియాలో నెగటివ్ కామెంట్స్ చూసినా ? మనస్తాపానికి గురయ్యేదాన్నని ఇంటర్వ్యూలో వెల్లడించింది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**